

సాక్షి పల్నాడు

ఆదివారం । 15 । జనవరి । 2023



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద శనివారం 1216 క్యూసెక్కులు విడుదల చేశారు. కొమ్మమూరు కాల్వకు 900 క్యూసెక్కులు విడుదల చేశారు.



వైభవంగా గోదాదేవి కల్యాణం

వేదాద్రి(జగ్గయ్యపేట): వేదాద్రి యోగానంద లక్ష్మీ నరసింహ స్వామి వారి ఆలయంలో శనివారం గోదాదేవి కల్యాణం వైభవంగా జరిపించారు.

కరోనా జీరో



గుంటూరు మెడికల్: జిల్లా వ్యాప్తంగా శనివారం కరోనా పాజిటివ్ కేసు ఒక్కటి కూడా నమోదు లేదు. జిల్లాలో ఎక్కడా కరోనా మరణాలు సంభవించ లేదు.

న్యూస్‌రీల్

అమరేశ్వరుడికి 'భోగి' సేవ



అమరావతి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అమరావతిలో వేంచేసియున్న శ్రీబాలచాముండికా సమేత అమరేశ్వరుని సంక్రాంతి ఉత్సవాలలో భాగంగా భోగి పండుగ గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శనివారం స్వామి వారికి ఉదయాన్నే మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాన్ని నిర్వహించి అమ్మవారికి ప్రత్యేక కుంకుమార్చనలు నిర్వహించారు. ఆలయంలో సంక్రాంతి పండుగ మూడు రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. గ్రామోత్సవంలో స్వామివారి ఉత్సవమూర్తులను గ్రామస్తులు దర్శించుకుని హారతులిచ్చి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానాచార్యులు కౌశిక చంద్రశేఖర శర్మ మాట్లాడుతూ ఈ పండుగతో పాడిపంటలతో పాటు ఆధ్యాత్మిక సాంప్రదాయాలను కూడా ఆచరించటం విశేషమన్నారు. సంక్రాంతి నుంచిఉత్తరాయణ పుణ్యకాలం ప్రారంభమవుతుందని ఉత్తరాయణ పుణ్యకాలంలో సర్వేశ్వరుని అనుగ్రహం పొందడానికి అనువైన కాలంగా పురాణాలు చెబుతున్నాయన్నారు. సంక్రాంతి ఉత్సవాలలో తొలిరోజున స్వామి వారిని భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 575.30 అడుగుల వద్ద ఉంది. ఇది 269.8721 టీఎంసీలకు సమానంగా ఉంది. సాగర్ జలాశయం నుంచి కుడికాలువకి 8,144, ఎడమకాలువకు 6,634, ఎస్ఎల్‌బీసీకి 2,400, వరదకాలువకు 320 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. దీంతో సాగర్ జలాశయం నుంచి మొత్తం ఔట్‌ఫ్లోగా 17,498 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం నుంచి సాగర్ జలాశయానికి 17,498 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 849.10 అడుగుల వద్ద ఉంది. ఇది 78.0365 టీఎంసీలకు సమానం.

ఇంద్రకీలాద్రిపై సంక్రాంతి సంబరాలు



భవానీపురం(విజయవాడపశ్చిమ): సంక్రాంతి పర్వదినాల్లో భాగంగా శనివారం భోగి సందర్భంగా వైదిక కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలను నిర్వహించారు. మంత్రోచ్ఛారణలు, మేళతాళాల నడుమ సంప్రదాయబద్ధంగా గొబ్బెమ్మలు, గంగిరెద్దులు, హరిదాసులతో భోగి మంటలను శ్రీదుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ దర్భముళ్ల భ్రమరాంబ వెలిగించారు. అనంతరం భోగి మంటలకు నమస్కరిస్తూ దాని చుట్టూ ప్రదక్షిణలు చేశారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మహామండపం ఏడవ అంతస్తు పెద్ద రాజగోపురం ఎదురుగా ఏర్పాటు చేసిన బొమ్మల కొలువును ఆలయ ఈఓ భ్రమరాంబ ప్రారంభించారు. సాయంత్రం పెద్ద రాజగోపురం ఎదురుగా ఉన్న ప్రదేశంలో చిన్న పిల్లలకు భోగి పండ్లు పోసి ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఆలయ స్థానాచార్యులు విష్ణుభట్ల శివప్రసాద శర్మ, వైదిక కమిటీ సభ్యులు శ్రీనివాస శాస్త్రి, ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి పి.సుధారాణి, పి.చంద్రశేఖర్, ఎన్.రమేష్, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి భ్రమరాంబ అందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలుపుతూ అమ్మవారు, స్వామివారి కృపాకటాక్షాలు అందరికీ ఉండాలని ఆకాంక్షించారు.

విద్యుత్ కాంతులీనుతున్న శుభాకాంక్షల పర్వం



గుంటూరులో భోగిమంటలు వేసి ఆనందిస్తున్న నగరవాసులు





గుంటూరులో జరిగిన సంబరాల్లో డప్పు వాయిస్తున్న ఎంపీ అయోధ్య రామిరెడ్డి, పక్కన ఎమ్మెల్సీ అప్పిరెడ్డి, ఎమ్మెల్యే మద్దాళి గిరి, మేయర్ కావటి, చంద్రగిరి ఏసురత్నం, కమిషనర్ కీర్తి చేకూరి తదితరులు

ఊరూరా సంక్రాంతులు

తెలుగువారి పెద్ద పండుగ, తొలి పండుగ 'సంక్రాంతి'. ఈ పర్వదిన వేడుకలకు గుంటూరు, బాపట్ల, నరసరావుపేట కేంద్రాలు శనివారం వేదికలుగా నిలిచాయి. తెలుగు పండుగ శోభ అందరిలోనూ కనిపించింది. అమాత్యులు, నేతలు, అధికారులు, పురజనులు అందరూ సంప్రదాయ వస్త్రధారులై పండుగకు వన్నె తీసుకువచ్చారు. 'పదిమంది మాత్రమే చేసుకునే పండుగ కాదు / పదిమందితో కలసి చేసుకునే పండుగ' అననుకునేలా వారంతా ఒక్కటై పర్వదినాన్ని జరుపుకున్నారు. భోగి మంటలు, పతంగుల ఎగురువేత వంటి కార్యక్రమాలతో వన్నె తెచ్చారు. 'సంక్రాంతి' ఒంటరిగా మాత్రం రాదు! మహారాణిలా ముందు 'భోగి'ని, తరువాత 'కనుమ'ని వెంటబెట్టుకుని చెలికత్తెల మధ్య రాకుమారిలా వస్తుందన్న మాటలను నిజం చేసేలా వారంతా సాంస్కృతిక కదంబాన్ని ఆస్వాదించారు. –సాక్షి ఫొటోగ్రాఫర్, గుంటూరు



సత్తెనపల్లిలో జరిగిన సంబరాల్లో నృత్యం చేస్తున్న మంత్రి అంబటి రాంబాబు

పల్నాడులో ఉత్సాహంగా సంబరాలు

- రెండోరోజు కార్యక్రమాలకు సంప్రదాయ దుస్తులతో హాజరైన కలెక్టర్, ఎమ్మెల్యే
- భోగిమంటలు రగిల్చి.. భోగిపండ్లు పోసి...
- ఆకట్టుకున్న గంగిరెద్దుల విన్యాసం

నరసరావుపేట: పల్నాడు జిల్లాలో సంక్రాంతి సంబరాలు రెండరోజు శనివారం అట్టహాసంగా కొనసాగాయి. జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్, శాసన సభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఉదయాన్నే పట్టణంలోని బ్రహ్మానందరెడ్డి కాంప్లెక్స్ ఆవరణలో నిర్వహించిన భోగి మంటల వేడుక కార్యక్రమంలో సంప్రదాయ బద్ధంగా పాల్గొన్నారు. సత్తెనపల్లి రోడ్డులోని డి.ఎస్.ఎ. స్టేడియంలో జరుగుతున్న వేడుకలకు ముఖ్య అతిథులుగా ఇరువురూ సంప్రదాయ దుస్తులతో ప్రత్యేక ఆకర్షణగా హాజరయ్యారు. కార్యక్రమ నిర్వహణ సమన్వయకర్తలైన డీఆర్‌డీఏ పీడీ బాలు నాయక్, శ్రీ నరసరావుపేట కళా వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు పొన్నపాటి ఈశ్వరరెడ్డి, పలువురు జిల్లా అధికారులు అతిధులకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.

స్టేడియం ప్రవేశమార్గం నుంచి మేళ తాళాలు, హరిదాసులు, సన్నాయి మేళాలు, కనక తప్పెట్లతో ప్రజలతో కలిసి ఊరేగింపుగా స్టేడియంలో కలియ తిరిగారు. డీఆర్‌డీఏ విభాగం, మెప్మా, బొమ్మల కొలువులు, వైద్య ఆరోగ్యశాఖ, ఉద్యానవన శాఖ, వ్యవసాయ శాఖ శాఖలు ఏర్పాటుచేసిన స్టాళ్లను ప్రారంభించి తిలకించారు. జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించి, ఐసీడీఎస్ ప్రాజెక్టు ఏర్పాటు చేసిన చిన్నారులకు భోగి పండ్లు (రేగిపండ్లు) పోసే కార్యక్రమంలో పాల్గొని ఆశీర్వచనాలను అందజేశారు. గంగిరెద్దుల ఆటలు, మహిళల కోలాటం, బొమ్మల కొలువు, స్టాల్స్ ఎగ్జిబిషన్ సందర్శించి, ప్రజల్లో ఉత్సాహం నింపారు. వంటలు పోటీలు, ముగ్గుల పోటీలు, డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ ద్వారా ఏర్పాటు చేసిన స్టాల్ ఎగ్జిబిషన్‌లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సంబా ఏడుకొండలు, మరో నలుగురు హరిదాసుల విన్యాసాలను తిలకించారు. ఆయా శాఖల జిల్లా అధికారులు సాంప్రదాయ దుస్తులతో వచ్చి, జిల్లా కలెక్టర్, నియోజకవర్గ శాసనసభ్యులకు స్వాగతం పలికి వారి కార్యకలాపాలను సంక్రాంతి సంబరాలు సందర్భంగా ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను చూపించి రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో జరుగుతున్న కార్యక్రమాలను వివరించారు. వేడుకలకు పెద్ద ఎత్తున ప్రజలు తరలి రావడం ఆనందంగా ఉందంటూ, సంక్రాంతి పండగను జరుపుకుంటున్న వారందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కుటుంబ సభ్యులు, జిల్లా రెవెన్యూ అధికారి డి.వినాయకం, డీఆర్‌డీఏ పీడీ బాలూ నాయక్, ఉద్యాన శాఖ అధికారి బీ.జే.బెన్నీ, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి ఐ.మురళి, డీడీఎం మహాలక్ష్మి, ఐసీడిఎస్ ప్రాజెక్టు అధికారులు, ఆయా శాఖల అధికారులు, మహిళలు, చిన్నారులు, ప్రజలు పాల్గొన్నారు.



డీఎస్‌ఏ స్టేడియంలో సంక్రాంతి సంబరాల్లో చిన్నారులకు భోగిపండ్ల కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ శివశంకర్, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి



కోలాటం ఆడుతున్న కలెక్టర్, ఎమ్మెల్యే

జగనన్న హయాంలో ప్రతిరోజూ పండుగే



సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్న మంత్రి మేరుగ నాగార్జున

వేమూరు: జగనన్న ప్రభుత్వంలో రాష్ట్రంలోని ప్రజలందరికీ ప్రతిరోజు పండగేనని రాష్ట్ర సాంఘిక సంక్షేమ మంత్రి మేరుగ నాగార్జున పేర్కొన్నారు. వేమూరు మండల కేంద్రంలో శనివారం సంక్రాంతి సంబరాలు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ పండగలు అంటే సంస్కృతి సంప్రదాయాలను తెలియజేయడంతో పాటు పెద్దలు చూపిన మార్గంలో ముందుకు సాగాలన్న స్ఫూర్తిని అందిస్తాయన్నారు. సంక్రాంతి రైతుల పండగన్నారు. తెలుగు లోగిళ్లకు సంక్రాంతి తొలి కాంతులు తీసుకు వస్తుందని చెప్పారు. శనివారం భోగి మంటలు నిర్వహించడం జరిగిందని ఆయన తెలిపారు. భోగి పండగ పెద్దలను గౌరవించాలన్న సందేశాన్ని సంక్రాంతి ప్రకృతిని, పశు సంపదను కాపాడుకోవాలన్న స్ఫూర్తిని, కనుమ పండగ తెలియజేస్తాయన్నారు.

హ్యాండ్‌బాల్ పోటీల్లో విజేతలు విశాఖపట్నం జట్లు

గన్నవరం: కృష్ణాజిల్లాలోని గన్నవరం జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో గత రెండు రోజులుగా జరుగుతున్న అంతర్ జిల్లాల 37వ సబ్ జూనియర్, 44వ జూనియర్ బాలుర హ్యాండ్‌బాల్ పోటీలు శనివారం ఘనంగా ముగిశాయి. ఈ పోటీల్లో సబ్ జూనియర్, జూనియర్ విభాగాల్లో విజేతలుగా విశాఖపట్నం జట్లు, రన్నర్స్‌గా నంద్యాల జట్లు నిలిచాయి. జూనియర్ విభాగంలో తృతీయ స్థానంలో కర్నూలు, విజయనగరం జట్లు, సబ్ జూనియర్స్ విభాగంలో అనంతపురం, తూర్పు గోదావరి జట్లు తృతీయ స్థానం సాధించాయి. అనంతరం వరుసగా మూడు స్థానాల్లో నిలిచిన జట్లకు ఒలింపిక్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేపీ రావు, ఖోఖో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు టీఎస్ఆర్‌కే ప్రసాద్, హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఉమ్మడి కృష్ణాజిల్లా అధ్యక్షుడు కేవీఆర్ కిషోర్ చేతుల మీదుగా మెడల్స్, ట్రోఫీలను అందజేశారు. గత నాలుగేళ్లుగా నిలిచిపోయిన హ్యాండ్‌బాల్ పోటీలను విజయవంతంగా నిర్వహించిన ఉమ్మడి కృష్ణాజిల్లా అసోసియేషన్‌ను కేపీ రావు అభినందించారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచిన సుమారు రెండు వేల మంది గత రెండేళ్లలో స్పోర్ట్స్ కోటా రిజర్వేషన్ ద్వారా ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారని చెప్పారు. క్రీడాకారులకు మరిన్ని ఉద్యోగావకాశాలను కల్పించాలనే తమ విజ్ఞప్తిపై రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా ఉందన్నారు. అనంతరం పోటీలను విజయవంతంగా నిర్వహించిన అసోసియేషన్ అధ్యక్షుడు కేవీఆర్ కిషోర్, ఆర్గనైజింగ్ కార్యదర్శి జి.రాంబాబును దుశ్శాలువాలతో సత్కరించారు.



జూనియర్స్‌లో విజేతగా నిలిచిన విశాఖపట్నం జట్టు

ముగ్గురికి గాయాలు

వరికుంటపాడు: రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు గాయపడిన ఘటన మండల కేంద్రమైన వరికుంటపాడు సమీపంలో శనివారం చోటుచేసుకుంది.

పత్రిక ప్రకటన

యం.వి. అప్పారావు, న్యాయవాది. కొత్తపేట, వినుకొండ, పల్నాడు జిల్లా. సెల్ నెం. 9441691087

ప్రజలందరికి సంక్రాంతి శుభాకాంక్షలు — మంత్రి విడదల రజిని



చిలకలూరిపేట: సంక్రాంతిని పురస్కరించుకొని ప్రజలకు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. సంక్రాంతి అంటేనే రైతులు, పల్లెలు గుర్తుకొస్తాయని, పాడి పంటలతో రైతులు, అన్ని వర్గాల ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో సంక్షేమ పాలన సాగుతోందని చెప్పారు. ప్రతి ఇంటా సంతోషాలు నిండాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు — జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా



గుంటూరు ఎడ్యుకేషన్: తెలుగువారి పెద్ద పండుగ సంక్రాంతి జిల్లా ప్రజల కుటుంబాల్లో సంతోషాలను నింపాలని జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సుపరిపాలనలో గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి బాటలో పయనిస్తూ, పండుగ శోభతో కళకళ లాడుతున్నాయని అన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రజలు, ప్రజా ప్రతినిధులు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, అధికారులకు శుభాకాంక్షలు తెలిపారు.

నకిలీ బంగారం అమ్మిన ఇద్దరు అరెస్ట్

బేస్తవారిపేట: నకిలీ బంగారు బిస్కెట్లు అమ్మిన ఇద్దరిని అరెస్టు చేసినట్లు కంభం సీఐ రాజేష్‌కుమార్ తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శనివారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. సీఐ కథనం ప్రకారం.. పల్నాడు జిల్లా పిడుగురాళ్లకు చెందిన అత్త, అల్లుడు తురక సురేష్, అచ్చంపేటకు చెందిన గుంజి కోటేశ్వరమ్మ పరిచయం లేని వారికి ఫోన్ చేసి పరిచయం చేసుకుంటారు. మా వద్ద బంగారు బిస్కెట్లు ఉన్నాయని, తక్కువ రేటుకు అమ్ముతామంటూ నమ్మిస్తారు. ఈ నేపథ్యంలో గత నెల 15వ తేదీన బేస్తవారిపేట మండలం చిన్న ఓబినేనిపల్లెకు చెందిన కాకర్ల గురువర్‌కుమార్‌తో ఫోన్‌లో పరిచయం పెంచుకుని మాయమాటలు చెప్పి రూ.2 లక్షలకు అరకేజీ నకిలీ బంగారం బిస్కెట్‌ను అమ్మారు. గురువర్‌కుమార్ బిస్కెట్‌ను చెక్‌చేయిస్తే నకిలీగా తేలింది. అమ్మిన వ్యక్తులకు ఫోన్ చేస్తే స్విచ్‌ఆఫ్‌గా వస్తోంది. ఈనెల 11వ తేదీన బేస్తవారిపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. విచారణ చేసిన పోలీసులు శనివారం పందిళ్లపల్లె టోల్‌ప్లాజా వద్ద తురక సురేష్, గుంజి కోటేశ్వరమ్మలను అరెస్టు చేశారన్నారు. వీరిపై 2009లో పెదనందిపాడు, 2020లో సంతమాగులూరు, 2022లో తాడేపల్లి పోలీస్ స్టేషన్‌లలో కేసులు నమోదై ఉన్నాయన్నారు. పాత బంగారు నాణేలు, బిస్కెట్లు తక్కువ రేటుకే అమ్ముతామనే మాయమాటలు నమ్మవద్దని ప్రజలను సీఐ కోరారు. ఎవరైనా మోసపూరిత మాటలు చెబితే పోలీసులకు ఫిర్యాదు చేయాలని కోరారు. ఈ కేసులో మరొకరిని అరెస్ట్ చేయాల్సి ఉందని, మూడు రోజుల్లోనే నిందితులను గుర్తించి అరెస్ట్ చేసిన ఎస్ఐ మాధవరావును అభినందించారు. కార్యక్రమంలో ఎస్ఐ మాధవరావు పాల్గొన్నారు.

భావితరాలకు సంస్కృతి నేర్పాలి



పట్టణంలోని గాంధీచౌక్‌లో భోగి మంటలు చుట్టూ జనసందోహం

- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు
- సత్తెనపల్లి గాంధీ చౌక్ సెంటర్లో భోగి వేడుకలు
- బంజారాలతో కలసి సంప్రదాయం నృత్యాలలో స్టెప్పులు వేసిన మంత్రి అంబటి

సత్తెనపల్లి: తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుంటూ భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. పట్టణంలోని గాంధీ చౌక్ సెంటర్‌లో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో భోగి వేడుకలు శనివారం నిర్వహించారు. ఉదయం 5 గంటలకే భోగి వేడుకలను ప్రారంభించారు. పార్టీ శ్రేణులు, ప్రజలతో మమేకమై నాయకులందరితో సందడిగా నృత్యం చేయించారు. అనంతరం మంత్రి అంబటి మాట్లాడుతూ భోగి పండుగ ప్రజలందరికీ భోగభాగ్యాలు అందించా లన్నారు. ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. భోగి పండుగ ప్రాసస్త్యాన్ని వివరించారు. చెడును దహించి మంచిని స్వాగతిద్దామన్నారు. నిత్యం రాజకీయాలు, సద్విమర్శలు, ప్రతిపక్షాలపై మాటల తూటాలతో విరుచుకుపడే మంత్రి అంబటి రాంబాబు భోగి పర్వదిన వేడుకల్లో భాగంగా నిర్వహించిన భోగిమంటల్లో ఆయన పాల్గొని అలరించారు. భోగిమంటల వేడుకల్లో ఉల్లాసంగా ఉత్సాహంగా బంజారాలతో కలిసి నృత్యం చేస్తున్నంత సేపు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, కేరింతలు, కరతాళధ్వనులు, ఈలలతో సందడి హోరెత్తించారు. కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివ రావు, మున్సిపల్ వైస్ చైర్మన్ రమావత్ కోటేశ్వరరావు నాయక్, ఏఎంసీ మాజీ చైర్మన్ రాయపాటి పురుషోత్తమ రావు, నాయకులు అచ్యుత శివప్రసాద్, తుమ్మల వెంకటేశ్వరరావు, ఎం.వి.సుబ్బారెడ్డి, దేవతి సుబ్బారావు, బచ్చు మనోహర్, వరికల్లు కోటేశ్వ రరావు, షేక్ సలీం, పెద్దింటి వెంకటేశ్వర్లు(చిట్టి), కాకుమాను రవి, లోకా మాధవ, కూకుట్ల శ్రీను, దేవరశెట్టి రవి కుమార్, చిలుకా మోషే, బండి మల్లిఖార్జునరెడ్డి, గడ్డం వెంకటేశ్వర్లు, అవ్వారు శ్రీను, శెట్టి ఆనంద్, ఆకుల రమేష్, గుజ్జర్లపూడి సతీష్, శిరిగిరి వెంకట్రావు, షేక్ గని, షేక్ మౌలాలి(సహారా), ఉల్లంఘుల ప్రసాద్, పులిబండ్ల అశోక్, తాళ్లూరి మోహన్ బాబు, లక్కాకుల మరియన్న పాల్గొన్నారు.



బంజారాలతో కలసి డ్యాన్స్ చేస్తున్న మంత్రి అంబటి రాంబాబు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

తాడేపల్లి రూరల్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. వివరాలు.. ఎంటీఎంసీ పరిధిలోని నిడమర్రుకు చెందిన కర్రి మరియదాసు (55) బైక్ మంగళగిరి నుంచి నిడమర్రులోని ఇంటికి వెళుతున్నాడు. అదే సమయంలో నిడమర్రు నుంచి ముగ్గురు యువకులు మంగళగిరిలో సినిమాకు వెళ్లాలని హడావుడిగా వచ్చి శిబిరం- నవులూరు గేటు మధ్య ఎదురుగా వస్తున్న మరియదాసు ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో మరియదాసు అక్కడికక్కడే మృతి చెందాడు. ముగ్గురు యువకులు కూడా బండి మీద నుంచి కింద పడడంతో స్వల్ప గాయాలు అయ్యాయి.